కార్యకర్తలకు అండగా డిజిటల్ బుక్

మాజీ మంత్రి జోగి రమేష్


ఇబ్రహీంపట్నంలో డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ ఆవిష్కరిస్తున్న జోగి రమేష్, నాయకులు


తిరువూరులో డిజిటల్ బుక్ క్యూ ఆర్ కోడ్ ఆవిష్కరిస్తున్న రామిరెడ్డి, నాయకులు

ఇబ్రహీంపట్నం: వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు అండగా వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ యాప్ రూపొందించారని మాజీ మంత్రి జోగి రమేష్ అన్నారు. కూటమి పాలనలో నిజాలను నిర్భయంగా చెప్పలేక పోతున్న ప్రజల్లో భయాలు పోగొట్టేందుకు డిజిటల్ బుక్ ఉపయోగపడుతుందన్నారు. ఇబ్రహీంపట్నంలో డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్‌ను ఆదివారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. సీఎంగా చంద్రబాబు పాలన చేపట్టిన ఏడాదిన్నర కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా వేల మంది వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై కేసులు పెట్టి వేధిస్తున్నారన్నారు. డిజిటల్ బుక్‌లో ఉన్న వారిని రానున్న మన ప్రభుత్వంలో సప్త సముద్రాల వెనుక దాక్కున్నా తీసుకొచ్చి చట్ట పరిధిలో చర్యలు తీసుకునే బాధ్యత తీసుకుంటామని చెప్పారు. గతంలో చంద్రబాబు ఇంటికి నిరసన తెలిపేందుకు వెళితే 37 మందిపై కేసులు పెట్టిన విషయాన్ని గుర్తుచేశారు. మన ప్రభుత్వంలో మొదటగా వారికి న్యాయం చేస్తామన్నారు.

బూడిద కాలుష్యంపై ప్రజలకు ఏమి న్యాయం చేశారు?

ఎన్టీటీపీఎస్ బూడిద కాలుష్యం, అక్రమ బూడిద రవాణాపై లారీ డ్రైవర్లు, ప్రజల తరపున పోరుబాట పడితే మమ్మల్ని అరెస్ట్ చేశారన్నారని చెప్పారు. అసెంబ్లీ వేదికగా కాలుష్యం సమస్య ప్రస్తావించి ఎమ్మెల్యే వసంత ఈప్రాంత ప్రజలకు ఏమి న్యాయం చేశారని నిలదీశారు. అసెంబ్లీ వేదికగా కాంట్రాక్ట్ డబ్బులు నేను చెల్లిస్తానని, బూడిద అక్రమంగా తరలించేందుకు నర్మగర్భ వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటన్నారు. రానున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఎన్టీటీపీఎస్ కాలుష్యం నివారణకు చర్యలు తీసుకుని, సూపర్ స్పెషాలిటీ వైద్యశాల నిర్మిస్తామని చెప్పారు.

జనసేన ఎమ్మెల్యేల స్పందనేదీ?

బాలకృష్ణ అసెంబ్లీలో మెగాస్టార్ చిరంజీవిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తుంటే జనసేన ఎమ్మెల్యేలు కిమ్మనకుండా కూర్చోవడం వెనక ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. అన్నయ్యను బాలకృష్ణ తిడుతుంటే పవన్ కల్యాణ్ ఎందుకు స్పందించ లేదని ప్రశ్నించారు. విదేశాల్లో ఉన్న చిరంజీవి స్పందించి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మమ్మల్ని గౌరవించారని చెప్పడం గొప్ప విషయమన్నారు. మానసిక రుగ్మతలు కలిగిన బాలకృష్ణ జగన్‌ను విమర్శించడం సిగ్గుచేటన్నారు. జెడ్పీ వైస్ చైర్మన్ గరికపాటి శ్రీదేవి, రాష్ట్ర కార్యదర్శి వేములకొండ తిరుపతిరావు, సహాయ కార్యదర్శి మేడపాటి నాగిరెడ్డి, జి.కొండూరు జెడ్పీటీసీ మందా జక్రధరరావు, ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు పచ్చిగోళ్ల పండు, వైఎస్సార్ సీపీ ఫ్లోర్ లీడర్ గుంజా శ్రీనివాస్, మండల పార్టీ అధ్యక్షుడు రెంటపల్లి నాగరాజు, వివిధ విభాగాల నాయకులు వాహెద్, నల్లమోతు దయాకర్, గోగులమూడి రాణి, ఉయ్యూరు శ్రీనివాస్ రెడ్డి, నర్రా విజయ్, మూరకొండ సాంబశివ రావు, ఎస్.ఈశ్వరి, ఎన్.దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

కూటమి అరాచకాలు డిజిటల్ బుక్‌లో నమోదు

తిరువూరు: కూటమి ప్రభుత్వ వేధింపులకు గురయ్యే వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, సోషల్ మీడియా కార్యకర్తలకు అండగా ఉండేందుకు పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి డిజిటల్ బుక్ రూపొందించారని వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ పరిశీలకుడు తంగిరాల రామిరెడ్డి అన్నారు. తిరువూరులో డిజిటల్ బుక్ క్యూ ఆర్ కోడ్ ఆవిష్కరణ కార్యక్రమం ఆది వారం జరిగింది. ఆయన మాట్లాడుతూ ప్రతి కార్యకర్త డిజిటల్ బుక్ క్యూ ఆర్ కోడ్ ను సెల్‌ఫోనులో భద్రపరచుకోవాలని, చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే కూటమి నాయ కులు, అధికారుల వివరాలను నమోదు చేయాలని సూచించారు. తిరువూరు పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు చలమాల సత్యనారాయణ, తాళ్లూరి నవీన్‌కుమార్, విస్సన్నపేట జెడ్పీటీసీ సభ్యుడు లోకేశ్వరరెడ్డి, తిరువూరు నగర పంచాయతీ కౌన్సిలర్లు మోదుగు ప్రసాద్, తంగిరాల వెంకటరెడ్డి, పరసా శ్రీనివాసరావు, ఏరువ ప్రకాష్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ నాయకులు నరెడ్ల వీరారెడ్డి, శిరసాని ప్రకాష్, రేగళ్ల మోహన్‌రెడ్డి, కాలసాని గోపాల నాగేశ్వరరావు, యరదేశి రామారావు, తుమ్మూరు వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైభవంగా గంగానమ్మ జాతర



నూజివీడు: పట్టణంలోని గంగానమ్మ ఆలయం వద్ద నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు గంగానమ్మ తల్లిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన అన్నదానాన్ని ప్రతాప్ అప్పారావు ప్రారంభించారు. అనంతరం ప్రతాప్ అప్పారావును శాలువాతో గంగానమ్మ గుడి నిర్వాహకులు మలిశెట్టి బాబీ సత్కరించారు. రావి నాగేశ్వరరావు, కౌన్సిలర్ నవుడు నాగమల్లేశ్వరరావు, నాయకులు కొండూరు శివప్రసాదరెడ్డి, గాదెరెడ్డి రంజిత్‌రెడ్డి, యర్రంశెట్టి రవితేజ తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టపరిహారం అందించాలి

వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్

తిరువూరు: ఇటీవల కురిసిన భారీవర్షాలకు తిరువూరు మండలంలో వరి, పత్తి, మిర్చి పంటలు దెబ్బతిన్నందున రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని సీపీఐ అనుబంధ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యవర్గ సభ్యుడు చిలుకూరి వెంకటేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. తిరువూరు మండలంలోని సూరవరం, పీటీకొత్తూరు, ఎర్రమాడు, ముష్టికుంట్ల, రోలుపడి, రాజుగూడెం గ్రామాల్లో పంట పొలాలను సీపీఐ నాయకులు ఆదివారం సందర్శించారు. అధిక వర్షాలతో పంటలు చేతికందకుండా పోయే పరిస్థితి ఉన్నందున వ్యవసాయశాఖాధికారులు వెంటనే నష్టం అంచనాలు రూపొందించాలని విజ్ఞప్తి చేశారు. సీపీఐ నాయకులు నాగుల్‌మీరా తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

తిరువూరు: గతంలో నేరాలకు పాల్పడినవారు అసాంఘిక కార్యకలాపాలు, వివాదాల్లో తలదూరిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని తిరువూరు సెక్టార్-1 ఎస్ఐ సత్యనారాయణ హెచ్చరించారు. ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో పాత నేరస్తులకు, రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. నేర చరిత్ర కలిగిన వారిపై నిఘా ఉంటుందని, ఎక్కడ నేరాలు జరిగినా వారిని విచారించేందుకు అవకాశం ఉంటుందని ఎస్ఐ చెప్పారు. సత్ప్రవర్తనతో మెలిగి సమాజంలో గౌరవంగా బతకాలని సూచించారు.

రెండేళ్ల సాయిఆద్యకు కలాంస్ అవార్డు ప్రదానం



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లికి చెందిన రెండేళ్ల పోరంకి సాయిఆద్య కలాంస్ వరల్డ్ రికార్డు సొంతం చేసుకుంది. చెన్నైలో శనివారం రాత్రి జరిగిన కార్యక్రమంలో తల్లిదండ్రులు పోరంకి సాయితేజ, దివ్యశ్రీతో కలిసి మెమోంటోతో పాటు ప్రశంసాపత్రం అందుకుంది. చిన్నారి సాయిఆద్య రైమ్స్, శ్లోకాలు, దేశంలోని రాష్ట్రాల పేర్లు, జాతీయ చిహ్నాలు, రాజధానులు, జంతువులు, పక్షులు, వాహనాలు, అక్షరమాల, స్థిర వస్తువులు, కూరగాయలు తదితర 500 రకాల పేర్లు తక్కువ సమయంలో గుర్తించి పఠించడంతో అవార్డుకు ఎంపికైంది. చిన్నారి సాయి ఆద్య వైఎస్సార్ సీపీ కొండపల్లి పట్టణ అధ్యక్షుడు పోరంకి శ్రీనివాసరాజు మనుమరాలు. ఈ సందర్భంగా పట్టణంలోని పలువురు నాయకులు బాలికను అభినందించారు.

కృష్ణమ్మకు మళ్లీ వరద

- నీటి ముంపునకు గురైన పుష్కర నగర్
- మినుము పంటకు అపార నష్టం
- లంక గ్రామాలకు రాకపోకలు బంద్


ఇబ్రహీంపట్నం ఫెర్రీ వద్ద రోడ్డుపైకి చేరిన వరద నీరు


పుష్కర నగర్‌లోకి చేరిన వరద నీరు


జూపూడిలో లంక గ్రామాలకు వెళ్లే దారిలో ప్రవహిస్తున్న వరద నీరు

ఇబ్రహీంపట్నం: కృష్ణానదికి మళ్లీ వరద ప్రవాహం పోటెత్తింది. ఎగువన పులిచింతల ప్రాజెక్ట్ నుంచి సుమారు ఆరు లక్షల క్యూసెక్కులకు పైగా వరద నీరు నదిలో ప్రవహించడంతో లోతట్టు ప్రాంతాలు జలమయ మయ్యాయి. ఇబ్రహీంపట్నం ఫెర్రీ వద్ద స్నానఘాట్ మెట్లపై నుంచి సుమారు 30 మీటర్ల దూరంలో ఉన్న చిరు వ్యాపారుల దుకాణాల వద్దకు వరద ప్రవాహం చేరింది. సమీపంలోని పుష్కర నగర్‌లోకి వరద నీరు చేరింది. ఇళ్లల్లోకి నీరు రావడంతో అప్రాంత ప్రజలు రోడ్లపైకి చేరి కాలం వెళ్లదీస్తున్నారు. పవిత్ర సంగమం వద్ద ఎప్పటికప్పుడు పెరుగుతున్న వరద ప్రవాహంతో మెట్లపైకి నీరు చేరింది.

మినుము పొలాలు మునక

మూలపాడు, కొటికలపూడి, చినలంక, జూపూడి గ్రామాల్లో ఇప్పటికే సాగుచేసిన మినుము పొలాలను వరదనీరు ముంచెత్తింది. మరో నెలన్నరలో పంట చేతికొస్తుందనే దశలో వరద ప్రవాహంలో పైరు మునిగిపోవడంతో నష్టం వాటిల్లుతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. వరద తీవ్రత ఎక్కువగా ఉండటంతో చినలంక, పెదలంక గ్రామాలకు వెళ్లే దారిలో సుమారు 10 అడుగుల ఎత్తులో కిలో మీటరు వెడల్పున నీరు ప్రవహిస్తోంది. లంక గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. అత్యవసర పనులకు పడవలపై స్థానికులు ప్రయాణాలు కొనసాగిస్తున్నారు. చినలంక గ్రామస్తులను పునరావాస శిబిరాలకు తరలించేందుకు తహసీల్దార్ వై.వెంకటేశ్వర్లు చర్యలు తీసుకుంటున్నారు. చేపల వేటకు ఎవరూ వెళ్లవద్దని తహసీల్దార్ సూచించారు. లంక గ్రామాల ప్రజలు సహాయక శిబిరాలకు రావాలన్నారు. రెవెన్యూ సిబ్బంది, పోలీసులు నదీ పరీవాహక ప్రాంత గ్రామాల్లో పహారా కాస్తున్నారు.

రక్షణ కవచంలా డిజిటల్ బుక్

మాజీ ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు


నూజివీడులో డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ ఆవిష్కరిస్తున్న ప్రతాప్ అప్పారావు, నాయకులు

నూజివీడు: కూటమి ప్రభుత్వ హయాంలో అన్యాయానికి, దోపిడీకి, దందాలకు గురైన వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు అండగా ఉండేందుకే వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డిజిటల్ బుక్‌ను తీసుకువచ్చారని మాజీ ఎమ్మెల్యే, నూజివీడు నియోజకవర్గ ఇన్‌చార్జి మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్‌ను ఆదివారం ప్రతాప్ అప్పారావు నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ప్రతాప్ అప్పారావు మాట్లాడుతూ ఈ డిజిటల్ బుక్ ప్రతి కార్యకర్త, నాయకుడికి రక్షణ కవచంలా ఉంటుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై దాడులు చేయడం, దందాలకు పాల్పడటం, అక్రమ కేసులను బనాయించడం, సోషల్ మీడియా యాక్టివిస్టులపై తప్పుడు కేసులు పెట్టడం తదితర అనేక అప్రజాస్వామిక చర్యలకు పాల్పడుతున్నారన్నారు. ఈ వివరాలన్నింటినీ కార్యకర్తలు ఎప్పటికప్పుడు డిజిటల్ బుక్‌లో నమోదు చేయాలని, మనం అధికారంలోకి రాగానే డిజిటల్ బుక్‌లో ఉన్న విషయాలకు అధిక ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఇబ్బందులు ఎదుర్కొంటున్న కార్యకర్త డిజిటల్ బుక్ యాప్‌లో ఆధారాలతో సహా అప్‌లోడ్ చేయాలని సూచించారు.

ప్రతి కార్యకర్తకు న్యాయం

అధికారంలోకి వచ్చిన తరువాత ప్రతీ కార్యకర్తకు న్యాయం చేస్తామని ప్రతాప్ అప్పారావు చెప్పారు. ఈ యాప్ ముఖ్యంగా అన్యాయానికి గురైన వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు భరోసా కల్పించడం కోసమేనన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ముసునూరు, చాట్రాయి మండలాల అధ్యక్షులు మూల్పూరి నాగవల్లేశ్వరరావు, పుచ్చకాయల సుబ్బారెడ్డి, ఆగిరిపల్లి, ముసునూరు జెడ్పీటీసీలు పిన్నిబోయిన వీరబాబు, వరికూటి ప్రతాప్, ముసునూరు వైస్ ఎంపీపీ కోటగిరి రాజానాయన, ఏలూరు జిల్లా అధికార ప్రతినిధి కంచర్ల లవకుమార్, మాజీ జెడ్పీటీసీ బాణావతు రాజు, రైతు విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు ఈలప్రోలు వెంకటసుబ్బయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము వెంకటేశ్వరరావు, క్రిస్టియన్ మైనారిటీ ఏలూరు జిల్లా అధ్యక్షులు పిళ్లా చరణ్, నాయకులు పలగాని నరసింహారావు, మచ్చా హరిబాబు, మందాడ శివశంకర్‌రావు, నండూరు భాస్కరశర్మ, అత్తి మురళి, షేక్ గబ్బర్, కె. రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

త్రిశక్తి స్వరూపిణీ.. మహాచండీ నమోస్తుతే


మునగపాడు గ్రామంలో అమ్మవారు


తిరువూరు కూరగాయల మార్కెట్లో అన్నదానం

తిరువూరు: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు తిరువూరు, మైలవరం, నూజివీడు నియోజకవర్గాల్లో వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాలు ఆదివారం ఏడో రోజుకు చేరుకున్నాయి. అమ్మవార్లు మహా చండీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పలు ప్రాంతాలు, ఆలయాలు, పందిళ్లలో అమ్మవార్లు వివిధ రూపాల్లో పూజలందుకున్నారు. గంపలగూడెం మండలం ఊటుకూరు కోదండరామాలయంలో వారాహిదేవిగా, గంపలగూడెం రామాలయం వీధిలో మహాచండీదేవిగా, ఊటుకూరు రజకపేటలో దుర్గాదేవిగా, నెమలి శ్రీవేణుగోపాలస్వామి దేవస్థానంలో విజయలక్ష్మీదేవిగా, ఎ.కొండూరు మండలం గోపాలపురం సాయి మందిరంలో కాత్యాయనీదేవిగా, తిరువూరు గౌరీ కేదారేశ్వరస్వామి ఆలయంలో కంచి కామాక్షీదేవిగా, శ్రీచంద్రమౌళీశ్వరాలయంలో మహాచండీదేవిగా, శ్రీరామలింగేశ్వరాలయంలో కాత్యాయనీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. తిరువూరు సర్దార్ పేటబాపయ్య మున్సిపల్ కూరగాయల మార్కెట్‌లో నవ రాత్రి ఉత్సవ పందిరిలో భక్తులకు అన్నదానంచేశారు.

- **జి.కొండూరు:** దసరా ఉత్సవాల్లో భాగంగా మునగపాడు గ్రామంలో ఏర్పాటు చేసిన కనకదుర్గమ్మ అమ్మవారిని ఏడోరోజు ఆదివారం శ్రీ మహాచండీ దేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించారు.
- **మైలవరం:** మైలవరం రాజాపేటలోని రేణుక ఎల్లమ్మ త్రిశక్తి పీఠంలో అమ్మవారు మహా చండీదేవి అలంకరణలో పూజలందుకున్నారు. మైలవరం కేడీసీసీ బ్యాంకు వద్ద, ఆర్ అండ్ బీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన అమ్మవారి చలువ పందిళ్లలో అమ్మవారి విగ్రహాలను పూలతో అలంకరించి పూజలు చేశారు.

నూజివీడు: పట్టణంలోని కోటమహిషాసురమర్దని అమ్మవారు ఆదివారం మహాచండీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పంచామృతాభిషేకం, కుంకుమార్చన, చక్రార్చన నిర్వహించారు. తెల్లవారుజామున ఐదు గంటల నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ఆగిరిపల్లి: స్థానిక రుద్ర భూమి వద్ద కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారు మహా చండీ దేవిగా, రజక వీధిలో అమ్మవారు వారాహి దేవిగా, రేణుక క్షేత్రంలో కృష్ణ దుర్గాదేవి అమ్మవారు మహా చండీగా పూజలందుకున్నారు. క్షేత్రం వ్యవస్థాపకుడు వీర కృష్ణ భవానీకి భక్తులు తులాభారం నిర్వహించారు.

చాట్రాయి: మండలంలోని అన్ని గ్రామాల్లో అమ్మవారు శ్రీ మహాచండీ దేవీగా భక్తులకు దర్శనమిచ్చారు. పలు చోట్ల ఏర్పాటు చేసిన విగ్రహాల వద్ద భక్తులు పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.


శ్రీ కోట మహిషాసురమర్దని అమ్మవారు


చాట్రాయిలో పూజలందుకున్న అమ్మవారు


గంపలగూడెం రామాలయం వీధిలో మహాచండీదేవిగా..


గోపాలపురంలో కాత్యాయనీదేవి అలంకారం


తిరువూరు గౌరీకేదారేశ్వరస్వామి ఆలయంలో..


ఊటుకూరు కోదండరామాలయంలో వారాహిదేవిగా..


మైలవరంలో మహా చండీదేవి అలంకారం

రేబిస్‌పై అవగాహన అవసరం

ఆగిరిపల్లి: రేబిస్ వ్యాధికి చికిత్స లేనందున వ్యాధి నివారణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని డెప్యూటీ డీఎంహెచ్ జాస్తి జగన్‌మోహన్‌రావు అన్నారు. ఆదివారం ప్రపంచ రేబిస్ దినోత్సవం సందర్భంగా ఆగిరిపల్లిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే అత్యంత ప్రమాదకరమైన వ్యాధి రేబిస్ అని చెప్పారు. పెంపుడు కుక్కల యజమానులు తమ కుక్కలకు తప్పనిసరిగా రేబిస్ టీకాలు వేయించాలన్నారు. కుక్క కాటుకు గురైన బాధితులు తప్పనిసరిగా వ్యాక్సిన్ వేయించుకోవాలని సూచించారు.

పన్ను తగ్గింపుపై అవగాహన కల్పించాలి

ముసునూరు: వస్తువులు, సేవల పన్ను తగ్గింపుపై వినియోగదారులకు అవగాహన కల్పించాలని డెప్యూటీ ఎంపీడీఓ బీపీ సత్యనారాయణ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు కేంద్ర ప్రభుత్వం తగ్గించిన వస్తువులు, పన్నుల సేవల ప్రచారంపై ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పన్నుల తగ్గింపు వల్ల వినియోగదారులకు కలిగే లాభాలను గ్రామ సచివాలయాల స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

బాలకృష్ణ క్షమాపణ చెప్పాలి


కంబాల రాంబాబు

ముసునూరు: బాలకృష్ణకు మెంటల్ మరింత ముదరడంతో ఎక్కడ, ఏమి మాట్లాడుతున్నాడో కూడా తెలియడం లేదని, ఆయన వ్యాఖ్యలను ఖండిస్తున్నామని వైఎస్సార్ సీపీ ఏపీ స్టేట్ ఎస్సీ సెల్ జనరల్ సెక్రటరీ కంబాల రాంబాబు అన్నారు. ఆదివారం కాట్రేనిపాడులో ఆయన మాట్లాడుతూ బాలకృష్ణకు వైఎస్సార్ కుటుంబం చేసిన మేలును మరిచి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేశారని, తన వ్యాఖ్యలు వెనక్కు తీసుకుని వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

పవిత్ర సంగమం వద్ద ఉత్సవాలపై నిషేధం

ఇబ్రహీంపట్నం: కృష్ణా నదికి వరద ప్రవాహం పెరుగుతున్నందున ఇబ్రహీంపట్నం పవిత్ర సంగమం వద్ద దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జరుగుతున్న విజయ నర్తనం కార్యక్రమం నిషేధించామని తహసీల్దార్ వై.వెంకటేశ్వర్లు ఆదివారం ఒక ప్రకటనలతో తెలిపారు. పవిత్ర సంగమం వద్ద నీటి ప్రవాహం పెరిగి ప్రమాదాలకు కారణం కావచ్చనే అనుమానం వ్యక్తం చేశారు. వేడుకల నిషేధ ఉత్తర్వులు ఈ నెల 28 నుంచి అక్టోబర్ ఐదో తేదీ వరకు అమలులో ఉంటాయని చెప్పారు.

దుర్గమ్మ దీవెనలు అందరిపై ఉండాలి

మాజీ మంత్రి జోగి రమేష్



ఇబ్రహీంపట్నం: కనకదుర్గమ్మ కరుణాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని మాజీ మంత్రి జోగి రమేష్ అన్నారు. ఇబ్రహీంపట్నం ప్రసాద్ నగర్‌లోని కనకదుర్గమ్మ ఆలయంలో దుర్గమ్మ అమ్మవారిని ఆయన దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. మూలపాడు విరూపాక్షేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు మహాచండీగా భక్తులకు దర్శనమిచ్చారు. పూజా కార్యక్రమాలతో పాటు అన్నదానం జరిపారు. పవిత్ర సంగమం వద్ద విజయనర్తనం కార్యక్రమంలో భాగంగా మహిళలకు ముగ్గుల పోటీలు ఏర్పాటు చేశారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

నూజివీడు: స్థానిక పురపాలక సంఘం కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని సోమవారం నిర్వహిస్తామని మున్సిపల్ కమిషనర్ ఆర్.వెంకటరామిరెడ్డి ఆదివారం తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణీదుర్గ అధ్యక్షతన మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ మందిరంలో ఉదయం 11 గంటలకు నిర్వహించే ఈ సమావేశంలో కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, సంబంధిత అధికారులు పాల్గొనాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

150 మందికి వైద్య పరీక్షలు

జూపూడి(ఇబ్రహీంపట్నం): జూపూడి గ్రామంలో రత్న జంతు సంక్షేమ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం ఆదివారం నిర్వహించారు. 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.